ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





మాదాపూర్: కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కథక్, కూడిపూడి నృత్యప్రదర్శనలను నిర్వహించారు. వారణాసిమేధా గణేష్, మేఘు నగరాడ్‌లు కథక్ ప్రదర్శనలతో అలరించారు. ఇందులో శివవందన శివతాండవ, కృష్ణవందన తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. శ్రీదేవి నాట్యాలయ గురువు శ్రీదేవి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రదర్శించారు. ఇందులో గణేశ పుష్పాంజలి, వినాయకకౌతం, సతులారా, అలరింపు, అన్నమాచార్యకీర్తనలను అలపించి ఆకట్టుకున్నారు. కళాకారులుజ్యత్స్న, వైష్ణవి, నక్షత్ర, దీప్తి, రోహిని, జయేష్, అక్షర, హన్సిక, శాన్వి నందిత పాల్గొన్నారు.

'నిథమ్' ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌కు గ్రాండ్ క్వీన్ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న మిషెల్లీఫ్రాన్సిస్

రాయదుర్గం: 'నిథమ్'లో కెరియర్ కౌన్సిలర్, మెంటర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిషెల్లీఫ్రాన్సిస్‌కు గ్రాండ్ క్వీన్ అవార్డు–2024 అందించి గౌరవించారు. లయన్స్‌క్లబ్, గ్రాండ్ క్వీన్స్‌క్లబ్ సంయుక్తంగా ఈ గ్రాండ్ క్వీన్ అవార్డును అందించారు. వివిధ రంగాలలో విశేషమైన కృషి చేస్తున్న వారిని గుర్తించి వారి సేవలకు ప్రతిఫలంగా గ్రాండ్ క్వీన్ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. అందులో భాగంగా 2024లో మిషెల్లీఫ్రాన్సిస్‌ను అవార్డు కోసం ఎంపిక చేశారు. పర్యాటక అతిథ్య కేంద్రమైన 'నిథమ్'లో ఆమె అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం నగరంలో లయన్స్‌క్లబ్, గ్రాండ్‌క్వీన్స్‌క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అవార్డును స్వీకరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పటాన్‌చెరు టౌన్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల హక్కులను కాలరాసిందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్మెంట్‌తో పాటు పీఆర్సీ ప్రకటించడంతో ఆదివారం పట్టణ బస్టాండ్‌లో కాంగ్రెస్ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఆర్టీసీని భూస్థాపితం చేయడానికి ప్రయత్నించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3నెలల లోపే కార్మికులకు పీఆర్సీ అమలు చేయడం హర్షణీయమన్నారు. హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, ఇషాక్, హమీద్, యువరాజ్ మోరే, అతిక్, సంజీవ్, రతన్‌సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువు శిఖం.. మాయం

- మట్టి పూడ్చి కబ్జా చేస్తున్న రియల్టర్లు
- పరిరక్షణ చర్యలు చేపట్టని అధికారులు



మురుగు నీటితో మేళ్ల చెరువు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెరువులు, కుంటలను పరిరక్షించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొన్నిచర్యలు తీసుకున్నా అవి పూర్తిస్థాయిలో అమలు కాలేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వాలు మారినా చెరువులకు రక్షణ లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందడంతో పాటు మహానగరంగా విస్తరిస్తోంది. ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో ఇక్కడ ఉన్న శిఖం భూములపై రియల్ వ్యాపారుల కన్ను పడింది. అధికార యంత్రాంగంలోని లోపాలను ఆసరాగా తీసుకొని కొందరు రియల్ వ్యాపారులు చెరువు శిఖం భూములలో మట్టిని నింపుతున్నారు. చెరువులను దర్జాగా కబ్జా చేస్తున్నా అటు పాలకులు, ఇటు అధికారులు పూర్తిస్థాయిలో వాటిని నియంత్రించక లేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చెరువు శిఖం(ఎఫ్‌టీఎల్) పరిధిలో ఉన్న పట్టాభూముల్లో మట్టి పోసి చదును చేయడం కానీ, ఎలాంటి నిర్మాణాలు కానీ చేపట్టకూడదు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నీళ్ళు లేనప్పుడు వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంది. కానీ కొందరు ఏకంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీ ఎత్తున మట్టి నింపుతున్నారు. ఈ విషయం అధికారులకు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే స్థానిక అధికారులు వచ్చి హడావిడి చేస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. కానీ అక్రమార్కులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో చెరువుల పరిరక్షణ గాలికి వదిలేసినట్లు ఉంది. తెల్లాపూర్‌లోని మేళచెరువు, వనం చెరువు, చెలికుంటలను పరిక్షించాలని స్థానికులు కొన్నేళ్ళుగా అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేదు. ప్రస్తుతం చెరువులోకి వర్షపు నీరు వెళ్లే కాలువలు పూర్తిగా కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వర్షం పడినా చెరువుల్లోకి చుక్క నీరు రావడం లేదు. అయితే చుట్టుపక్కల కాలనీ వాసులు వదిలే మురుగు మాత్రం చెరువుల్లోకి చేరుతుంది. కబ్జాలు జరిగి నిర్మాణాలు పూర్తయ్యాక అధికారులు వచ్చి నామమాత్రంగా కూల్చివేతలు చేపట్టడం ఎంత వరకు సబబు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రారంభంలోనే అక్రమాలను అడ్డుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా చెరువులను, కాలువలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు



చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. చెరువు శిఖంలో మట్టి పోసిన వారిపై కేసులు నమోదు చేయించాం. శిఖం భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు. – సంతోషిణి, ఏఈ, ఇరిగేషన్, రామచంద్రాపురం

కబ్జాలతో ముప్పు



చెరువులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. వాటి ఉనికిని కోల్పోతే భవిష్యత్ తరాలకు నీటి సమస్య తప్పదు. చెరువులు కబ్జాలకు గురైతే వర్షాలు పడినప్పుడు కాలనీలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. – ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేస్తా



సమస్యలను తెలుసుకుంటున్న కాంగ్రెస్ నేత జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్ కొత్తకుంట చెరువును, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలను స్థానికులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో గ్రేటర్ హైదరాబాద్‌నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానన్నారు. అనంతరం గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్: ప్రజా సమస్యలను స్టాడింగ్ కమిటీలో ప్రస్తావించి సత్వర పరిష్కారానికి కృషిచేస్తానని మియాపూర్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా మియాపూర్ జేపీనగర్ కాలనీలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జేపీ నగర్, ఏఎస్ రాజు నగర్ కాలనీ వాసులు పుష్పగుచ్చం అందజేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంతో పాటు కాలనీ, బస్తీలు అభివృద్ధి చెందేలా కృషిచేస్తానన్నారు.



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

మహిళల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు



పారిశుధ్య కార్మికులకు సన్మానిస్తున్న జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్: మహిళల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో కాలనీ మహిళ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ హాజరై పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రతి ఇంట్లో సంక్షేమం, ప్రతి ముఖంలో సంతోషం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, నల్ల సంజీవరెడ్డి, వీరేందర్ గౌడ్, సాంబశివరావు, రాజేష్, శ్రీనివాస్, ప్రసాద్, మహిళలు లక్ష్మి, అనిత, చంద్రకళ, శిరీష, విజయ తదితరులు పాల్గొన్నారు.

అభిరుచి ఉన్న రంగాలలో చిన్నారులను ప్రోత్సహించాలి

మాదాపూర్: అభిరుచి ఉన్న రంగాలలోనే బాలలను ప్రోత్సహించాలని సినీనటుడు మురళీమోహన్ తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ ఆడిటోరియంలో ఆదివారం విజయ్‌ఆర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసిన పోటీలలో గెలుపొందిన విజేలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్టూన్, పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వారికి నచ్చిన రంగాలలో ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సినీ దర్శకులు ఎస్.వి కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, సియాసత్ ఎడిటర్ అమీర్ అలీఖాన్, డాక్టర్ శోభరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సినీనటులు మురళీమోహన్ తదితరులు

రంజాన్ కేలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పండుగను పురస్కరించుకొని రూపొందించిన కేలెండర్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. 30 రోజుల పాటు అత్యంత కఠినమైన నిబంధనలతో ఉపవాసం ఉంటూ ప్రతిక్షణం దైవచింతనలో ఉండడం రంజాన్ మాసం గొప్పతనం అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఆదర్శ్‌రెడ్డి, నగేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండు, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, మెరాజ్ ఖాన్, షకీల్, మైనార్టీ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై అవగాహన



కిడ్నీ సమస్యలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

మాదాపూర్: జీనవశైలిలో మార్పుల వల్లే కిడ్నీ సమస్యలకు కారణమవుతున్నాయని డాక్టర్ కమల్ కిరణ్ తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఆదివారం బైక్‌రైడ్‌ను నిర్వహించారు. డాక్టర్లు మాట్లాడుతూ మారిన జీవనశైలి, పోషకాలు లేని ఆహారం తీసుకోవడం, సమయానికి తినకపోవడం, నీరు ఎక్కువగా తాగకపోవడం లాంటివి కిడ్నీ సమస్యలకు కారణమవుతున్నాయని తెలిపారు. ఆధునిక జీవితాల్లో మహిళలు పని ఒత్తిడిలో పడి ఆరోగ్యం సంగతే మర్చిపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీజీ స్పెషల్ ప్రొటెక్షన్ పోర్స్ తెలంగాణ అనిల్‌కుమార్, డాక్టర్ అనుపమ పండూరు, హర్లీ ఓనర్స్ గ్రూప్ బంజారా చాప్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ప్రమాదకరంగా దర్శనమిస్తున్న మ్యాన్‌హోళ్లు

మియాపూర్: మూతలులేని మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ నుండి ప్రశాంత్‌నగర్ వెళ్లే రోడ్డులో మ్యాన్‌హోళ్ల మూతలు ధ్వంసమై దర్శనమిస్తున్నాయి. అటువైపు రోడ్డులో వెళ్లే వాహనదారులు, పాదచారులు మ్యాన్‌హోళ్లలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. స్థానికులు మ్యాన్‌హోళ్ల వద్ద ఇతరత్రా వస్తువులను ప్రమాదం జరగకుండా ఏర్పాటు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 70, బెండ 55, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 60, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10, క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, వెల్లుల్లి 250.

● వైభవంగా వసంతోత్సవం



మహాశివరాత్రి మహోత్సవంలో బీరంగూడ గుట్టపై ఉన్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ శశిధర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, సభ్యులు, అర్చకులు పాల్గొని దేవతల విగ్రహాలను పల్లకీపై ఊరేగించారు. అనంతరం స్థానిక గుండంలో స్నానాలు చేయించారు.

– పటాన్‌చెరు టౌన్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత ఆకాంక్షించారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, మెప్మా ఆర్‌పీలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు అనేక రంగాల్లో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెంది పదిమందికీ ఉపాధి కల్పించాలని కోరారు. అనంతరం పారిశుధ్యం సిబ్బందికి దుస్తులు, కొబ్బరి నూనె, సబ్బులు, బెల్లం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్‌లు మంజుల, సరిత, చిట్టి, శ్రీశైలం, శంషాబాద్ రాజు పాల్గొన్నారు.